

హస్తం వైపే ప్రజల చూపు

ప్రజలంతా హస్తం పాలన కోసమే ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. 10లో▸



ప్రజల రుణం తీర్చుకుంటా

చేవెళ్ల ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటా అని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన బీంభరత్ అన్నారు. 10లో▸



ప్రాణం తీసిన అతివేగం

అతి వేగం ఓ యువ ఇంజనీర్ ప్రాణాలను బలిగొంది. కారు అదుపుతప్పి ఓ చెట్టును బలంగా ఢీకొట్టింది. 10లో▸

న్యూస్‌రీల్

కొత్తపేటలో కృతిశెట్టి సందడి



హుడాకాంప్లెక్స్: కొత్తపేటలో ఆదివారం సినీ నటి కృతిశెట్టి సందడి చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ వైట్‌హౌస్ టెక్స్‌టైల్స్ హ్యాండ్లూమ్ జ్యువెల్లరీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బొమ్మ రఘు రాంనేత, చిక్క శ్రీనివాస్, పెద్ది జగదీశ్, తడక రమేష్, వెంకటేశం, కస్తూరి సుదర్శన్, తడక యాదగిరి, గుజ్జ సత్యం పాల్గొన్నారు.

తేరుపల్లి సునందకు సేవారత్న అవార్డు



అవార్డు అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

షాబాద్: పేద ప్రజలకు తేరుపల్లి సునంద చేసిన సేవలు మరువలేనివని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో షాబాద్ మండలం చిన్న సోలీపేట్ గ్రామానికి చెందిన తేరుపల్లి సునందకు సేవారత్న నేషనల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ.. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బంగారు నగలు స్వాధీనం



పట్టుబడిన బంగారు నగలు

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా వేర్వేరుగా రెండు కార్ల నుంచి 53 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐలు మైబెల్లి, కృష్ణారెడ్డి తమ సిబ్బందితో శేరిగూడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వేర్వేరుగా రెండు కార్లలో తరలిస్తున్న బంగారాన్ని పట్టుకున్నారు. ఒక కారులో 39 తులాలు, మరో కారులో 14 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మొయినాబాద్: ఎన్నికల సందర్భంగా పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో లక్షల రూపాయలు పట్టుబడుతున్నాయి. ఆదివారం మండల పరిధిలోని గండిపేట చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ కారులో రూ. 1,18,700 పట్టుబడ్డాయి. ఆ డబ్బులకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేశారు.

ఫాంహౌస్‌లపై దాడి.. మద్యం బాటిళ్ల పట్టివేత

మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు ఫాంహౌస్‌లపై శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. అవదూత ఫాంహౌస్, ఎస్త్రీ ఫాంహౌస్‌లో ఎలాంటి అనుమతి లేకుండా పార్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు గుర్తించి 23 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. రెండు ఫాంహౌస్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్స్‌లో అత్యాధునిక వైద్యసేవలందిస్తున్నాం

లక్డీకాపూల్: అందివస్తున్న అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో నిమ్స్‌లో మరింత మెరుగైన వైద్య సేవలకు కృషి చేస్తున్నట్టు ఆస్పత్రి సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఆదివారం నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో హైదరాబాద్ నెఫ్రాలజీ ఫోరం, ఉమెన్ నెఫ్రాలజీ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ కేర్ విభాగంలో ఎక్స్‌ట్రాకార్పోరియల్ థెరపీపై ఒక రోజు సీఎంఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన బీరప్ప మాట్లాడుతూ.. నిమ్స్ వైద్యులు ఎప్పటికప్పుడు అంతర్జాతీయ వైద్య ప్రమాణాలను ఆకళింపు చేసుకుంటూ రోగికి నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఆస్పత్రిలో తరుచూగా కొనసాగుతున్న నిరంతర వైద్య శిక్షణ తరగతులే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నిమ్స్ నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సువర్ణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫణిశ్రీ పాల్గొన్నారు.

మేనిఫెస్టో విడుదలపై సంబురం



కడ్తాల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించిన మేనిఫెస్టోపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆయా ప్రాంతాల్లో బాణసంచా కాల్చి ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా.. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా మేనిఫెస్టో ఉందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

టికెట్ దక్కిన ఆనందం



షాద్‌నగర్: వీర్లపల్లి శంకర్ పేరును అధిష్టానం ప్రకటించడంతో సంబురాల్లో మునిగిన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ అధిష్టానం ఆదివారం ఉదయం ప్రకటించిన అభ్యర్థుల తొలి జాబితాపై ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వాల ఖరారుతో పార్టీ నాయకులు ర్యాలీలు నిర్వహించి.. బాణసంచా కాల్చి.. మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకున్నారు.

ముచ్చటగా మూడు

- కాంగ్రెస్ తొలి జాబితాలో ముగ్గురే ఖరారు
- చేవెళ్లకు భీంభరత్.. షాద్‌నగర్‌కు వీర్లపల్లి శంకర్.. కల్వకుర్తికి కసిరెడ్డి నారాయణరెడ్డి
- పెండింగ్‌లో ఎల్‌బీనగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం
- ఆశావహుల్లో ఎడతెగని ఉత్కంఠ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార పార్టీ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతుండగా.. ప్రతిపక్ష కాంగ్రెస్‌లో మాత్రం ఇప్పటికీ టికెట్ల పంచాయితీ తెగలేదు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉంటే.. వీటిలో ఆదివారం 55 మందితో ప్రకటించిన తొలి జాబితాలో మూడు స్థానాలే ఉండటం విశేషం. వీటిలో చేవెళ్ల నియోజకవర్గం నుంచి పి.భీంభరత్, కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణ రెడ్డి, షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకర్ ఉన్నారు. ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ప్రకటించక పోవడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రూరల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటనతో టికెట్లు దక్కించుకున్న వారు హర్షం వ్యక్తం చేస్తుండగా, ఆశావహులు నిరాశలో మునిగిపోయారు. అర్బన్ నియోజకవర్గాల్లో అందరిలో టెన్షన్ నెలకొంది. రోజుకో పేరు తెరపైకి వస్తుండడం.. ఆశావహులు తనకంటే.. తనకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటుండటంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. మరో మూడు నాలుగు రోజుల్లో వెల్లడించే రెండో జాబితాలో మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.

ఆ స్థానాలపై వీడని ఉత్కంఠ

- ఇబ్రహీంపట్నం నుంచి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు దాదాపు ఖరారైంది. ఆశావహులు, ఏఐసీసీలోని కొంత మంది పెద్దల నుంచి వచ్చిన ఒత్తిళ్ల నేపథ్యంలో ఆఖరి నిమిషంలో అభ్యర్థి పేరును ఖరారు చేసే విషయంలో అధిష్టానం వెనక్కితగ్గినట్లు తెలిసింది. ఇక్కడ ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా.. మిగిలిన ఆశావహులు అభ్యర్థికి సహకరించకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరిలో ఒకరిద్దరు అవసరమైతే ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- మహేశ్వరం నుంచి బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత పేరు దాదాపు ఖరారైనప్పటికీ.. సీనియర్ నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్ల నేపథ్యంలో అభ్యర్థి పేరు ప్రకటన వాయిదా పడ్డట్టు తెలుస్తోంది. ఇక్కడి నుంచి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పోటీపడుతున్నారు. మేయర్‌కు టికెట్ ఇస్తే.. మిగిలిన వారు కలిసి పని చేస్తారా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థి పేరును ప్రక టించడం కంటే మరి కొంత కాలం వాయి దా వేయడమే ఉత్త మని అధిష్టానం భా వించినట్లు తెలిసింది.
- ఎల్‌బీనగర్ నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీ పేరు దాదాపు ఖరారైంది. ఆశావహుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ముద్దగోని రామ్మోహన్ దంపతుల్లో ఎవరో ఒకరిని ఇక్కడి నుంచి బరిలోకి దించాలనే చర్చ కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ముందే అభ్యర్థి పేరును ప్రకటిస్తే.. మిగిలిన వారు బహిరంగంగా అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశం లేకపోలేదు.
- శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లో ఇదే పరిస్థితి. ఇక్కడి నుంచి బలమైన అభ్యర్థుల కోసం ఆఖరి నిమిషం వరకు అన్వేషించనున్నట్లు తెలిసింది.

చేవెళ్ల నియోజకవర్గం

అభ్యర్థి పేరు:	పామెన భీం భరత్
పుట్టిన తేదీ:	28-08-1973
తల్లిదండ్రులు:	పామెన అంతమ్మ, ఆగమయ్య
స్వగ్రామం:	నర్వేల్లగూడ, షాబాద్ మండలం
భార్య:	జ్యోతి
పిల్లలు:	ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు
విద్యార్హత:	బీఏ, ఎల్ఎల్‌బీ
రాజకీయ నేపథ్యం:	వామపక్ష భావజాల

నేపథ్యం ఉన్న భీం భరత్ 1990-95 వరకు సీపీఐలో పనిచేశారు. 1995లో షాబాద్ మండల జెడ్పీటీసీగా పోటీచేసి ఓడిపోయారు. 1996-2018 వరకు సీపీఐ(ఎంఎల్) జనశక్తిలో పని చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 2001-2014 వరకు పనిచేశారు. 2018లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2022 వరకు టీపీసీసీ స్పోక్స్ పర్సన్‌గా సేవలందించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నాయకుడిగా ఉన్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గం

అభ్యర్థి పేరు:	కాస్లాబాద్ శంకరయ్య, అలియాస్ వీర్లపల్లి శంకర్
పుట్టిన తేదీ:	1969, మార్చి 15
తల్లిదండ్రులు:	తల్లి అంజమ్మ, తండ్రి రామయ్య
స్వగ్రామం:	వీర్లపల్లి, నందిగామ మండలం
భార్య:	అనురాధ
విద్యార్హత:	బీకాం, సిటీ కాలేజ్, హైదరాబాద్
రాజకీయ నేపథ్యం:	ఊరిపేరునే ఇంటిపేరుగా

మార్చుకున్న కాస్లాబాద్ శంకరయ్య అలియాస్ వీర్లపల్లి శంకర్ 1992లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. 1995 నుంచి 2002 వరకు వీర్లపల్లి సర్పంచ్‌గా పని చేశారు. 2004 నుంచి 2014 వరకు పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడిగా పని చేశారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై 2014లో టీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. అనంతరం బీఎస్పీలో చేరి ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. నియోజకవర్గ బాధ్యతలు చేపట్టారు. 2021 నుండి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

కల్వకుర్తి నియోజకవర్గం

అభ్యర్థి పేరు:	కసిరెడ్డి నారాయణరెడ్డి
పుట్టిన తేదీ:	18 జనవరి 1964
తల్లిదండ్రులు:	కసిరెడ్డి కిష్టమ్మ, దుర్గారెడ్డి
స్వగ్రామం:	ఖానాపూర్, తలకొండపల్లి మండలం
భార్య:	మాధవి
పిల్లలు:	దుర్గాప్రసాద్, కృష్ణవంశీధర్‌రెడ్డి
విద్యార్హత:	ఎంటెక్
రాజకీయ నేపథ్యం:	బ్రిలియంట్ విద్యాసం

స్థలను, ఇంజనీరింగ్ కళాశాలలను నిర్వహిస్తూ 2014లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2014 ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి దక్కక పోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. అనంతరం 2016లో బీఆర్ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2018లో కల్వకుర్తి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. 2021లో ఎమ్మెల్సీగా మరోసారి పోటీ చేసి విజయం సాధించారు. ఈసారి కూడా టికెట్ ఆశించినా సిట్టింగ్‌కే ప్రకటించడంతో ఇటీవల ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ ప్రకటించిన తొలి జాబితాలోనే ఆయన పేరు ఉండటం విశేషం.

బాస్ నుంచి బీఫామ్‌లు





హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల సమావేశానికి షాద్‌నగర్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్ హాజరయ్యారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. – షాద్‌నగర్/ఆమనగల్లు

మేనిఫెస్టో అదిరింది

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ మేనిఫెస్టో అదిరిపోయిందని.. సీఎం కేసీఆర్ దెబ్బకు కాంగ్రెస్ గుండె బెదిరిపోయిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు పరిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీమ్స్ కేసీఆర్ దెబ్బకు దిమ్మతిరిగి కుదేలుకావడం ఖాయమన్నారు. పేదల సంక్షేమంపై ఆయకున్న చిత్తశుద్ధిని మేనిఫెస్టో మరోసారి స్పష్టం చేసిందన్నారు. అంతకు ముందు ఉదయం ఇబ్రహీంపట్నంలో పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు

నందీశ్వరా నా గెలుపు బాధ్యత నీదే

యాచారం: నందీశ్వరా.. నా గెలుపు బాధ్యత నీదే.. అంటూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదివారం ఉదయం నందివనపర్తిలోని నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గెలుపు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చ బాషా, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, నందివనపర్తి సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఏమరుపాటుకు తావివ్వొద్దు



- నగర కొత్వాల్ సందీప్ శాండిల్య
- జోన్ల వారీగా ఎన్నికల సమీక్షలు

సాక్షి, సిటీబ్యూరో: నగర కొత్త కొత్వాల్ సందీప్ శాండిల్య 'ఫ్రీ–ఫెయిర్–ఫర్మ్' ఎన్నికలే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా జోన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్, ఈస్ట్, సెంట్రల్ జోన్లతో పాటు టాస్క్‌ఫోర్స్ అధికారులతోనూ భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలపై సమీక్షిస్తున్నారు. ఆయా జోన్లలోని పోలీసుస్టేషన్లను ఏ,బీ,సీ కేటగిరీలు విభజించిన కొత్వాల్ మంజూరైన సిబ్బంది, ప్రస్తుతం అవసరాలు, అదనపు బలగాలపై నిర్ణయం తీసుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో భాగంగా నగదు, మద్యం, డ్రగ్స్ సహా ఇతర అక్రమ రవాణాలను అడ్డుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు నమోదైన కేసులు, ఎన్నికల కోడ్ అమలు, బైండోవర్లు, లైసెన్సడ్ ఆయుధాల డిపాజిట్, రౌడీషీటర్లపై తీసుకుంటున్న చర్యలు, కీలక, సమస్యాత్మక ప్రాంతాల మ్యాపింగ్, క్లిష్టమైన పోలింగ్ ప్రాంతాల గుర్తింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. పక్షం రోజులుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకున్న చర్యలపైనా సీపీ సమీక్షించారు. హైదరాబాద్‌లోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 90 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఏమాత్రం ఏమరుపాటుకు తావిచ్చినా, నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించమని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, ఎం.విశ్వ ప్రసాద్‌లతో పాటు జోనల్ డీసీపీలు పాల్గొన్నారు.

క్రీడా సంబురం

మొయినాబాద్: చిలుకూరు గురుకులంలో జరుగుతున్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం మూడో రోజు జరిగిన హ్యాండ్ బాల్‌లో చిలుకూరు జట్టు, ఫుట్‌బాల్‌లో గొలిదొడ్డి జట్టు, బాల్ బ్యాడ్మింటన్‌లో పరిగి జట్టు, కబడ్డీలో శంషాబాద్ జట్టు విజయం సాధించాయి. అథ్లెటిక్స్, క్యారమ్స్, చదరంగం పోటాపోటీగా సాగుతున్నాయి. గురుకుల విద్యాలయాల సంస్థ స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మణ్ క్రీడా పోటీలను వీక్షించి విజయం సాధించినవారిని అభినందించారు.



రన్నింగ్ పోటీ

హస్తం వైపే ప్రజల చూపు

- కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

తలకొండపల్లి: ప్రజలంతా హస్తం పాలన కోసమే ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆది వారం మండలంలోని పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా వారికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నగరంలోని తన నివాసంలో కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామన్నారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగి పోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, కృష్ణ, అభిలాష్, జంగయ్య, కుమార్, శివశంకర్, రాఘవరెడ్డి, చిత్తరంజన్‌దాస్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పట్నం' ఎవరికో హస్తం..?

మొదటి జాబితాలో తేలని అభ్యర్థిత్వం

- రోజురోజుకూ పెరుగుతున్న పోటీ
- 19న రెండో జాబితా
- పార్టీ కేడర్‌లో ఉత్కంఠ



ఇబ్రహీంపట్నం రూరల్: అధికార పార్టీ బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎవరనేది తేలింది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అభ్యర్థుల మొదటి జాబితాను వెల్లడించింది. ఈ జాబితాలో సీటు దక్కని నేతలు రెండవ జాబితాతో కోసం ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. రెండు ఎన్నికల్లో సీటు ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ సారి టికెట్ వస్తుందని గంపెడాశతో చూశారు. కానీ ఈ లిస్టులో ఆయన పేరు లేక పోవడంతో కంగుతిన్నారు. ఒకింత నిరుత్సాహానికి గురయ్యారనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థులు మొదటి జాబితా ఆదివారం విడుదల చేసింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభ్యర్థిని కూడా ప్రకటిస్తారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురుచూశారు. సర్వేలు, కులసమీకరణాల ఆధారంగా జాబితా వెల్లడిస్తామని ముందే అధిష్టానం ప్రకటించింది. కులాల వారీగా సీట్లు కేటాయించి జాబితాను విడుదల చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎప్పుడూ భంగపాటే

గత మూడు పర్యాయాల నుంచి ఇబ్రహీంపట్నం సీటుపై తర్జనభర్జన కొనసాగుతూనే ఉంది. 2009, 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఎన్నికల్లోనూ అభ్యర్థి ఎంపికలో ఎదురుచూపులు తప్పడం లేదు. 2009 ఎన్నికల్లో అప్పటి పీసీసీ అధ్యక్షుడు వైఎస్సార్, మల్‌రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చారు. అయితే 2014, 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వలేదు. దీంతో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగారు. 2014 ఎన్నికల్లో క్యామ మల్లేశ్ కాంగ్రెస్ పార్టీ నుంచి రెండవ జాబితాలో టికెట్ దక్కించుకున్నారు. ఇప్పుడు సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని చెప్పిన అధిష్ఠానం ఇబ్రహీంపట్నం అభ్యర్థిని ప్రకటించలేదు.

పోటీలో ఐదుగురు

ఇబ్రహీంపట్నం టికెట్‌కు ఐదుగురు పోటీ పడుతున్నారు. వారిలో మల్‌రెడ్డి రంగారెడ్డి, మర్రి నిరంజన్ రెడ్డి, దండెం రాంరెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్, కొత్తకుర్మ మంగమ్మఉన్నారు. వీరిలో ప్రస్తుతం మల్‌రెడ్డి రంగారెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి మధ్య తీవ్రపోటీ నెలకొంది. వీరిలో ఒకరికి పీసీసీ అధ్యక్షుడు అండగా ఉండగా భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరొకరికి సపోర్టు చేస్తున్నారు రంగారెడ్డికే ఇబ్రహీంపట్నం టికెట్ దక్కుతుందని బలంగా నమ్ముకున్నారు. కానీ నిరంజన్‌రెడ్డి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో పని అవుతోందో లేదోని నేరుగా హస్తిన నుంచే చక్రం తిప్పుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

మల్‌రెడ్డిలో నిరుత్సాహం!

ఆదివారం శేరిగూడలో మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ జాబితా విడుదల చేసింది. అందులో ఆయన పేరు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ప్రచారాన్ని మధ్యలోనే ఆపి.. నేరుగా శేరిగూడలోని ఏ బ్లాక్ అధ్యక్షుడి వెళ్లి.. అక్కడి నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకున్నట్లు తెలిసింది. రేవంత్‌రెడ్డి హామీతో మల్‌రెడ్డి ఊపిరి పీల్చుకున్నట్లు సమాచారం.

19న రెండవ జాబితా

ఈ నెల 19న కాంగ్రెస్ అభ్యర్థుల రెండవ జాబితా వెలువడనుంది. అందులో ఇబ్రహీంపట్నం అభ్యర్థి ఎవరు అనేది ఖరారు కానుంది. మల్‌రెడ్డికి ఇస్తారా లేక మర్రి నిరంజన్‌రెడ్డికా అనే ఉత్కంఠతో కేడర్ ఎదురుచూస్తున్నారు.

టీసీపీఐ ఇబ్రహీంపట్నం అభ్యర్థిగా మాధవరెడ్డి



ఇబ్రహీంపట్నం: తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(టీసీపీఐ) ఇబ్రహీంపట్నం అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించింది. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తుర్కయాంజాల్ మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం మాధవరెడ్డి తమ అభ్యర్థిగా నిర్ణయించామని ప్రకటన జారీ చేశారు. పార్టీ శ్రేణులు మాధవరెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. కాగా 2014 ఎన్నికల్లోనూ కొంతం ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

యాచారం: అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. సీఐ రామాంజనేయులు తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండల పరిధిలోని చరికొండకు చెందిన మహేశ్ యాచారం, మంచాల మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి ఆదివారం ఆటోలో తరలిస్తున్నాడు. నక్కర్తమేడిపల్లిలో పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకుని, బాధ్యుడైన మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దర్శనం శ్రీశైలం(32), మంజుల దంపతులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. శ్రీశైలం భార్య మంజుల శనివారం మధ్యాహ్నం తుక్కుగూడలోని తన అక్క ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం మంజుల ఇంటికి వెళ్లే వరకు శ్రీశైలం మృతి చెంది ఉన్నాడు. దీంతో ఆందోళన చెందిన ఆమె అత్త పార్వతమ్మ, బావ లింగమయ్య, తోటి కోడలు రేణుకలను తన భర్త ఎలా చనిపోయాడని ప్రశ్నించింది. వారు సమాధానం చెప్పలేదు. దీంతో తన భర్త మృతి అనుమానం ఉందని మంజుల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ తెలిపారు.

చేవెళ్ల ప్రజల రుణం తీర్చుకుంటా


చేవెళ్ల: మాట్లాడుతున్న భీంభరత్


షాబాద్: నాగర్‌గూడలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా పామెన భీంభరత్
- సంబురాల్లో మునిగిన అనుచరులు

చేవెళ్ల: పదేళ్లుగా చేవెళ్ల ప్రాంత ప్రజలు బీఆర్‌ఎస్‌తో ఎదుర్కొంటున్న సమస్యలుండవు.. ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే.. అని కాంగ్రెస్ విడుదల చేసిన తొలి లిస్టులో చోటు దక్కించుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి చేవెళ్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చేవెళ్ల గడ్డపై కాలె యాదయ్య ఆటలు ఇక సాగనివ్వమన్నారు. రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేందుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలు, తనకు తల్లి సమానులు మీరాకుమారి, సహకారం అందించిన నియోజకవర్గం నాయకులకు రుణపడి ఉంటాను. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు శ్రమిస్తానన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలపై గడప గడపకు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం సమన్వ సమితి చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వెంకటయ్య, మధుసుధన్‌గుప్తా, ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, భార్గవ్‌రామ్, సురేందర్ రెడ్డి, పడాల ప్రభాకర్, శ్రీనివాస్, పాండు, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, మంగలి నర్సింలు తదితరులు ఉన్నారు.

రేసులో ఉన్న నేతలను కలిసిన భీంభరత్

చేవెళ్ల టికెట్‌ను ఆశించిన సున్నపు వసంతం, మొయినాబాద్ మండలానికి చెందిన షాబాద్ దర్శన్‌లను భీం భరత్ వారి నివాసాలకు వెళ్లి కలిశారు. టికెట్‌రాని వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కలిసికట్టుగా పనిచేద్దామన్నారు.

చేవెళ్లపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

షాబాద్: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థిగా నరెడ్లగూడ గ్రామానికి చెందిన పామెన భీంభరత్ పేరును ప్రకటించడంతో మండల పరిధిలోని నాగర్‌గూడలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఫైల్వాన్‌షావాలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు డిక్లరేషన్లను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పీసరి సురేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ రాం, ఎంపీటీసీ సభ్యుడు అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, అక్తర్‌పాషా, రషీద్‌పటేల్, అశ్వక్‌అలీ, ప్రభాకర్, సుదర్శన్, ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్, తదితరులున్నారు.

లండన్ నుంచి వచ్చిన మూడు రోజులకే..


చెట్టును ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు

రోడ్డు ప్రమాదంలో యువ ఇంజనీర్ మృతి

యాచారం: అతి వేగం ఓ యువ ఇంజనీర్ ప్రాణాలు బలిగొంది. యాచారం సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూర్ గ్రామానికి చెందిన ఎండీ అమినుద్దీన్, గౌసియాబేగం దంపతుల మూడో కుమారుడు రఫీక్ (25) లండన్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఆయన హైదరాబాద్‌కు వచ్చాడు. చింతపల్లి మండల కేంద్రం సమీపంలో దర్గా వద్ద వారి బంధువులు ఏర్పాటు చేసిన విందుకు హాజరవ్వాలని ఆదివారం స్వగ్రామానికి బయలుదేరాడు. అతివేగంగా వెళ్తున్న కారు నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తుమ్మలోని గేట్‌వద్ద అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో యువకుడు కారులోనే ఇరుక్కుని ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి విషయం తెలుసుకున్న బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లింగంపల్లి స్టేషన్‌లో 58 కిలోల గంజాయి పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: ఒరిస్సా నుంచి ట్రైన్‌లో నగరానికి గంజాయి తరలించిన ముఠాను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు బ్యాగుల్లో 58 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులపైన కేసులు నమోదు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన క్యాసైన్, జితేందర్ మాలీ, రంజిత్ దొరగాలు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎక్సైజ్ అధికారులు లక్ష్మణ్‌గౌడ్, వీరబాబుల నేతృత్వంలోని బృందం తనిఖీలు నిర్వహించింది. నిందితుల వద్ద ఉన్న నాలుగు బ్యాగుల్లో 58 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వీధుల్లో వికృత చేష్టలు!

కారులో సన్‌రూఫ్ ఓపెన్ చేసి ఓ జంట అసభ్య ప్రవర్తన

సాక్షి, సిటీబ్యూరో: బీహార్‌లోని గయ, ఉత్తరప్రదేశ్‌లోని హపూర్, ఘజియాబాద్‌ల్లో రోడ్లపై ప్రయాణిస్తున్న జంటలు వికృత చేష్టలకు పాల్పడిన వీడియోలు ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి ఓ ఘటనే శనివారం రాత్రి నగరంలోని పీవీ నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్ వేపై చోటు చేసుకుంది. అయితే ఉత్తరాదిలోని జంటలు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ రెచ్చిపోగా... నగరంలోని జంట మాత్రం మరో అడుగు ముందుకు వేసి కారును వాడుకుంది. శనివారం రాత్రి ఎక్స్‌ప్రెస్ వేపై ఓ కియా కారు శంషాబాద్ వైపు నుంచి మెహదీపట్నం వైపు ప్రయాణించింది. ఇది ఎక్స్‌ప్రెస్ వేపై ఉండగానే దాని సన్‌రూఫ్ ఓపెన్ చేసుకున్న ఓ జంట అందులోంచి బయటకు నిలబడింది. పబ్లిక్‌గానే ఆలింగనాలు, చుంబనాలతో అభ్యంతరకరంగా ప్రవర్తించింది. ఆ కారు వెనుకే మరో కారులో ప్రయాణిస్తున్న వారు ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఇవి ఆదివారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఉత్తరాదిలోని నగరాలు, పట్టణాల్లో ఇలా వీధుల్లో వికృత చేష్టలకు పాల్పడిన జంటల్ని అక్కడి పోలీసులు సోషల్ మీడియాలోని వీడియోల ఆధారంగా పట్టుకుని చర్యలు తీసుకున్నాయి. ఎక్స్‌ప్రెస్ వే జంట విషయంలో ఇక్కడి పోలీసుల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

మహిళ అదృశ్యం

అత్తాపూర్: ముంబై వెళ్తున్నానని ఇంట్లో లేటర్ రాసి బయటికి వెళ్లిన మహిళ కనిపించకుండా పోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... ఎంఎం పహాడీ మహ్మద్ అలీ దర్గా ప్రాంతానికి చెందిన సారా ఫాతిమా (28), మహ్మద్ ముంతాజ్ అలీ దంపతులు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కాగా ఈ నెల 12న మధ్యాహ్నం 2 గంటల సమయంలో సారా ఫాతిమా ముంబైకు వెళ్తున్నానని ఇంట్లో లేటర్ రాసి పెట్టి బయటికి వెళ్లి ఆచూకీ లేకుండాపోయింది. దీంతో ఆందోళన చెందిన భర్త ముంతాజ్ అలీ స్థానికంగాను, స్నేహితులు, బంధువుల వద్ద, ఫోన్‌లో సంప్రదించినా.. ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సారా ఫాతిమా గతంలో ఇదే మాదిరిగా రెండుసార్లు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆదుకునేలా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో

శంషాబాద్: అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేలా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో రూపుదిద్దుకుందని బీఆర్‌ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే వ్యక్తిగా సీఎం కేసీఆర్ మరోమారు అద్భుతమైన మేనిఫెస్టోను ప్రజల ముందు ఉంచారన్నారు. రాష్ట్రంలోని తెల్లకార్డు గల ప్రజలందరికీ జీవిత బీమా కలిపించే పథకం ఎంతో గొప్పదన్నారు. ఎన్నో కుటుంబాలకు ఇది ఆసరాగా మారుతోందన్నారు. ఏటా పెన్షన్లను పెంచడంతో పాటు రైతుబంధు పథకాన్ని కూడా పెంచేందుకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందన్నారు. ప్రతి ఇంటా సన్నబియ్యం పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు కొంత ఆర్థికభారం తగ్గుతుందన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అడ్రస్ లేకుండా పోతాయన్నారు.

మహిళల కోసం సరికొత్త పథకాలు	పెన్షన్ల పెంపు మంచి నిర్ణయం	అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం	హర్షం వ్యక్తం చేస్తున్న మెజారిటీ ప్రజలు

బీఆర్‌ఎస్ మేనిఫెస్టో

బహు బాగు!



నగరంలో పేదల ఆశలు 'డబుల్'


బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోపై నగరంలోని మెజారిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పేదలు, మహిళలకు ప్రకటించిన సంక్షేమ పథకాలపై జేజేలు పలుకుతున్నారు. కేసీఆర్ బీమా–ప్రతి ఇంటికి ధీమా పథకంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెల్ల రేషన్ కార్డులున్న వారికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షల వరకు వైద్య సదుపాయంతో పాటు రైతు బీమా తరహాలో ఎల్‌ఐసీ ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా పేదల పాలిట వరమని చెబుతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న పేదలకు మేనిఫెస్టో మళ్లీ ఆశలు కల్పించిందంటున్నారు. మరో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామనే ప్రకటన ఊరటనిచ్చిందంటున్నారు. గృహలక్ష్మి కింద ఆర్థికసాయం, స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాల హామీ పేదల జీవితకాల స్వప్నాలకు కొత్త ఆశలు రేపింది. తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ, రూ.400కే గ్యాస్ సిలిండర్, అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3 వేల సౌభాగ్యలక్ష్మి పథకం సైతం ఎంతో ప్రభావం చూపనుంది. ఆసరా పెన్షన్లను రూ.5 వేలకు, దివ్యాంగుల పెన్షన్ రూ.6016కు పెంచుతామనే ప్రకటనలు ఆయా వర్గాలను ఆనందంలో ముంచెత్తాయి.

– సాక్షి, సిటీబ్యూరో

నగరానికి ప్రత్యేకత లేకపోవడంపై పెదవి విరుపు

నగరానికి సంబంధించి మేనిఫెస్టోలో ప్రత్యేక పథకాలు ఉంటాయని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. గ్రేటర్ నగరానికి ఎలాంటి ప్రత్యేక పథకాలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై హామీలు లేకపోవడంతో ఆయా వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.


ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ప్రజలకు ఆరోగ్య బీమా, అర్హులకు రూ.400కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతోపాటు నగరంలో మరో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే, కూకట్‌పల్లి

26.18 లక్షల కుటుంబాలకు లబ్ధి



బీఆర్‌ఎస్ మరోమారు అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్ సిలిండర్ రూ.400కు అందిస్తామని సీఎం కేసీఆర్ స్పష్టం చేయడంతో హైదరాబాద్ మహానగరంలోని సుమారు 26.18 లక్షల కుటుంబాలకు ఊరట లభించనుంది. గ్యాస్ సిలిండర్ ధరలతో విలవిలలాడుతున్న సామాన్య ప్రజలకు సీఎం కేసీఆర్ ఊరటనిచ్చే విషయాన్ని ప్రకటించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి ఏర్పాటు అయితే సిలిండర్ తక్కువ ధరలో అందిస్తామని కేసీఆర్ ప్రటించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వంట గ్యాస్ ధర రూ.955 ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.400 అందిస్తే ధర సగానికి పైగా తగ్గినట్లే.

20 లక్షల కుటుంబాలకు మేలు..

తెలంగాణ అన్నపూర్ణ పథకం కింద ప్రతి రేషన్ కార్డు హోల్డర్‌కు సన్నబియ్యం ప్రకటన హైదరాబాద్ మహానగరం పరిధిలోని సుమారు 20 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. హైదరాబాద్–రంగారెడ్డి – మేడ్చల్ జిల్లా పరిధిలోని సుమారు 16 లక్షల కార్డుదారులు ఉండగా, సరిహద్దు జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటూ రేషన్ పోర్టబిలిటీ కింద నగరంలోనే బియ్యం డ్రా చేస్తున్న కుటుంబాలు సుమారు నాలుగు లక్షలపైనే ఉన్నారు.


పెన్షన్ల పెంపుతో ఎందరికో ఆసరా



వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2016 పెన్షన్లను దశలవారీగా రూ.5 వేలకు పెంచుతామనడంతో ఆ వర్గాలకు ఎంతో ఆసరా లభించనుంది. సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్‌పై పేదలకు నమ్మకముంది.

– సిద్ధార్థ ముదిరాజ్, పటేల్‌నగర్, అంబర్‌పేట

ఉచిత పథకాలు మంచిది కాదు



ఒకరు రూ. 3వేలంటే మరొకరు రూ.4వేల భృతి అంటున్నారు. వేలం వేసినట్లు ఉచిత పథకాలు పెంచడం మంచిది కాదు. సంపద సృష్టించేలా పథకాలుండాలి గాని సంపదను అప్పనంగా పంచడం సరికాదు.

– ఎన్వీ రమణబాబు, విద్యావేత్త, సనత్‌నగర్